క్లుప్తంగా

సత్తాచాటిన ముద్దవరం జట్టు



బహుమతి అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని సయ్యద్ అల్లాబకాష్ వలీ ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకొని దర్గా కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీ బాల్ పోటీలను నిర్వహించారు. హోరా హోరీగా సాగిన పోటీల్లో ముద్దవరం జట్టు విన్నర్, బేతంచెర్ల దుర్గాపేట జట్టు రన్నర్ స్థానంలో నిలిచాయి. విజేతలకు దాతలు మెడల్స్, కప్పులతో పాటు రూ. 7,111, రూ. 3,116 నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖాజ, లింగ మూర్తి, రాజ, ఇమామ్ హుసేన్, ఫైల్ మాన్, గోరుమాను కొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేత ప్యాపిలి



విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ప్యాపిలి మండలం జట్లు ప్రథమ, నాల్గవ, ఆరవ స్థానాలు కైవసం చేసుకున్నాయి. రెండవ స్థానం బండి ఆత్మకుమార్, 3వ స్థానం ఆర్ ఎస్ రంగాపురం, 5వ స్థానం ఆర్ బుక్కాపురం జట్లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు దాతల సహకారంతో వరుసగా రూ. 10 వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ. 4వేలు, రూ.2వేలు, రూ. వెయ్యి చొప్పున నగదు బహుమతులు అందజేశారు.

నవోదయ మోడల్ పరీక్షకు విశేష స్పందన

డోన్ టౌన్: వీహెచ్‌పీ ఆధ్వర్యంలో స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం నిర్వహించిన నవోదయ మోడల్ పరీక్షకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ఉత్తమ ప్రతిభ కనబరచిన మణితేజ, మీనాక్షి, వంశీకృష్ణలకు వరుసగా రూ. 1500, రూ. 1000, రూ. 700 చొప్పు నగదు బహుమతులను అందజేశారు. అదేవిధంగా ప్రతి విద్యార్థికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు.

హక్కుల సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలి

డోన్ టౌన్: కార్మికుల హక్కుల సాధనకు ఐకమత్యంగా ఉద్యమించాలని, ఏఐటీయూసీ జెండా అండగా ఉంటుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య అన్నారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో ఆదివారం ఏఐటీయూసీ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు పోరా డి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 4 కోడ్‌లుగా విభజించి కార్పొరేట్ శక్తులకు పట్టం కడుతుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు అన్వర్, అబ్బాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ

కోవెలకుంట్ల: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న అనాథలు, అభాగ్యులకు ఆదివారం ఎంఆర్‌పీఎస్ నాయకులు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ బస్టాండ్, సంతమార్కెట్ సమీపంలో ఉంటున్న అనాథలకు నాయకులు కత్తి సుబ్బయ్య, రాజు, ఇంద్రకుమార్, రామవంశీ, రాజశేఖర్, ఓబులేసు భోజన ప్యాకెట్లు అందజేశారు.

వీరేశలింగం పంతులు జయంతి

డోన్ టౌన్: వీరేశలింగం పంతులు 175వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం పాతపేట జెడ్పీ హైస్కూల్లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ వీరేశలింగం పంతులు అతి చిన్న వయసులోనే సామాజిక స్పృహతో బాల్య వివాహాలను అరికట్టడానికి, వితంతు వివాహాలను ప్రోత్సహించారన్నారు. దాదాపు 40 జంటలకు వితంతు వివాహాలను జరిపించారని కొనియాడారు. వివేక వర్ధని పత్రిక ద్వారా అనేక మందిని చైతన్య పరిచారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌గౌడ్, సుబ్బారెడ్డి, లక్ష్మయ్య, మధుసూదనరెడ్డి, రాఘవేంద్ర, లక్ష్మి ప్రభావతి, భారతి, మద్దిలేటి, సుబ్బరాయుడు, మునిరాజు, ప్రసాద్‌రావు, లక్ష్మీప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అబ్దులాపురంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామసుబ్బారెడ్డిని ఆదివారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరామర్శించారు. గుండె సంబంధిత వ్యాధికి బెంగళూరులో చికిత్స పొందుతూ ఇటీవల నే ఇంటికి చేరుకున్నాడు. చైర్మన్ ఆ గ్రామానికి వెళ్లి రామసుబ్బారెడ్డితో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు ఉపాధ్యక్షుడు రామసుబ్బయ్య, నాయకుడు కామిని తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిరులు కురిపిస్తున్న మిరప!

- ఆశాజనకంగా దిగుబడులు
- జిల్లాలో 43, 318 ఎకరాల్లో మిరప సాగు
- బనగానపల్లె నియోజకవర్గంలో అత్యధికంగా 17,891 ఎకరాలు
- క్వింటాం రూ.22-24వేలు వరకు గిట్టుబాటు ధర
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు



పంట పొలాల వద్దనే మిరపను గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

బనగానపల్లె : ఎట్టకేలకు 'సాగు..బాగు' బాట పడుతోంది. వ్యవసాయం దండగ కాదు.. పండలా సాగుతోంది. ప్రభుత్వ సహకారం, అధికారుల సూచనలతోపాటు పకృతి కూడా అనుకూలించడంతో సాగు రైతులకు లాభసాటిగా మారింది. ప్రత్యేకించి ఏయేడాది మిరప(ఎండుమర్చి) సిరులు కురిపిస్తుంది. మద్దతు ధర కూడా బాగుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 43.318 ఎకరాల్లో మిరప సాగు చేయగా బనగానపల్లె నియోజకవర్గంలో అత్యధికంగా 17,891 ఎకరాల్లో సాగు చేశారు రైతులు. 2022-23 వ్యవసాయ సంవత్సరానికి ఖరీఫ్, రబీ సీజన్‌లలో నల్లరేగడి నేలల్లో ఎర్రబంగారం ధగధగ మేరిపిస్తుంది. బనగానపల్లె నియోజకవర్గంలో సాగు నీటి వనరులు ఎక్కువగా ఉన్నాయి. ప్రధానంగా ఎస్ఆర్‌బీసీ, అవుకు రిజర్వాయర్, కుందూనది తదితర వ్యవసాయ వనరులతో పాటు వ్యవసాయ బోర్ల ఆధారంగా పంటలకు సాగునీటి సౌకర్యం ఎక్కువగా ఉంది. వరి, శనగ తర్వాత అత్యధికంగా మిర్చి పంటను సాగు చేస్తారు. సూపర్ 10, తేజా యూ 5341 రకాలను సాగు చేశారు. అయితే మార్చిలో కురిసిన వడగండ్ల వర్షంతో కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో మిరప పంట భారీగా దెబ్బ తినింది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రైతులతో కలిసి పంట నష్టం జరిగిన పొలాలను పరిశీలించారు కూడా. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాటసాని అసెంబ్లీలోనూ ప్రస్తవించగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామని వ్యవసాయ శాఖ మంత్రి హామీ ఇచ్చారు. రైతుల సమస్యలపై ఎమ్మెల్యే కాటసాని చూపిన చొరువను అన్నివర్గాలు అభినందించాయి.

ఊపందుకున్న కోతలు

నాణ్యమైన పంట చేతికి అందుతుండడంతోపాటు మంచి ధర పలుకుతుండడంతో రైతులు ఊపరిపిల్చుకున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో కోతలు, గ్రేడింగ్ పనులు ఊపందుకున్నాయి. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తెచ్చుకుంటున్నారు రైతులు. ఇప్పటికే ప్రాంతాల వారీగా 3 నుంచి 4 కోతలు జరిగాయి. ఎకరానికి సరాసరి 20-22 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని రైతులు అంటున్నారు. గిట్టుబాటు ధర మార్కెట్‌లో ప్రస్తుతం రూ.22వేల నుంచి రూ.24వేలు పలుకుతుంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా మిరప సాగు వివరాలు

మండలం	ఎకరాలు
బనగానపల్లె	3,706
కోవెలకుంట్ల	3,914
సంజామల	5,388
అవుకు	3,408
కొలిమిగుండ్ల	1,475

దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి



ఈ సంవత్సరం ఐదెకరాల్లో మిరప సాగు చేశా. పెట్టుబడి ఖర్చు రెండు లక్షలు దాటింది. కాపు బాగుంది. దిగుబడులు ఎకరానికి 20 క్వింటాళ్ల వరకు వస్తుంది. పెట్టుబడిపోను మిగులు బాగుంటుందనే నమ్మకం ఉంది. అన్ని పంటల కన్న మిరప పంట గిట్టుబాటుగా ఉంది. వ్యవసాయాధికారులు కూడా బాగా సహకారం అందజేస్తున్నారు.

– రాముడు, రైతు మిట్టపల్లి, బనగానపల్లె మండలం

మిరప సాగు గిట్టుబాటుగా ఉంది



ఈ సంవత్సరం మిరప పంట అన్ని పంటలకంటే గిట్టుబాటుగా ఉంది. నేను పదెకరాల్లో మిరప సాగు చేశా. ఇప్పటికే ఎకరానికి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి లభించింది. మరో 6-7 క్వింటాళ్ల దిగుబడి లభిస్తుందనుకుంటున్నా. ప్రస్తుతం గుంటూరు మార్కెట్ యార్డులో ఈ పంటకు గిట్టుబాటు ధర క్వింటాం రూ.22-23 వేలు వరకు ఉంది.

– వెంకటేశ్వర్లు రైతు కాపులపల్లి,బనగానపల్లె మండలం

రైతులకు అనుకూలించిన పంట



గతంలో కంటే ఈ సంవత్సరం మిరప పంట సాగు రైతులకు అనుకూలంగా ఉంది. జిల్లాలోనే బనగానపల్లె నియోజకవర్గంలో ఎక్కువ విస్తీర్ణంలో ఈ పంటను రైతులు సాగు చేశారు. దిగుబడులు కూడా బాగా ఉన్నాయి. గిట్టుబాటు ధర ఉన్నందున రైతుల పంటపడింది. సాగులో రైతులకు తమవంతుగా సూచనలు అందజేస్తూ సహకరిస్తున్నాం.

– సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, బనగానపల్లె మండలం

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

18 నుంచి ఆధార్ నమోదు కేంద్రాలు

కొలిమిగుండ్ల: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 18 నుంచి 27 వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. 18న బందార్లపల్లె, 19, 20న అంకిరెడ్డిపల్లె, 26న తుమ్మలపెంట సమీపంలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో, 27న గొర్విమానుపల్లె, కొండమీదపల్లె గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, మార్పులు, చేర్పులు తదితర సౌకర్యాలు పొందవచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గడ్డివాములు దగ్ధం

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం ఆల్వకొండ గ్రామంలో ఆదివారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన రైతు బాలయ్య గడ్డివాములకు ప్రమాదశాత్తు నిప్పంటుకుని కాలిపోయాయి. దాదాపు రూ. 20వేలు విలువ పశుగ్రాసం కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు.

భవిష్యత్‌లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు



నాగిశెట్టిపల్లెలో నిర్మాణం పూర్తైన ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: భవిష్యత్‌లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తెలిపారు. జలజీవన్ మిషన్ పథకం కింద నాగిశెట్టిపల్లె, బిఉప్పలూరు, బితాడిపత్రి గ్రామాల్లో నిర్మాణ పనులు పూర్తైన ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు త్వరలోనే పైపులైన్ ఏర్పాటు చేసి ప్రజలకు నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. గ్రామాలు అవతరించినప్పటి నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు లేని గ్రామాలకు సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేయించి ట్యాంక్‌లు నిర్మించామని గుర్తు చేశారు. నాలుగేళ్లలో ఎక్కడా తాగునీటి సమస్య లేదన్నారు. సమృద్ధిగా వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు బాగా పెరిగాయన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చే ఏర్పాటు చేస్తామన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

బేతంచెర్ల: మండల పరిధిలోని కొలుములపల్లె గ్రామానికి చెందిన సురేష్ పురుగుల మందు తాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని చికిత్స నిమిత్తం బేతంచెర్లకు శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సమస్యలా, ఇతర కారణాలా అనే విషయం తెలియాల్సి ఉంది.

ఇద్దరిపై కేసు నమోదు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్యపై అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్, పద్మనాభయ్య పాత కక్షలు దృష్టిలో ఉంచుకుని దాడికి పాల్పడ్డారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అనాథ వృద్ధుడు మృతి

బనగానపల్లెరూరల్: పట్టణంలోని నంద్యాల రోడ్డులో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి మఠం సమీపంలో గుర్తు తెలియని అనాథ వృద్ధుడు ఆదివారం మృతి చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు దాదాపు 60 ఏళ్ల వృద్ధుడు పట్టణంలో బిక్షాటన చేసుకుంటూ ఆలయ సమీపంలోనే ఉండేవాడు. అనారోగ్యంతో మృతి చెందింటాడని అనుకుంటున్నారు. సీఐ సుబ్బరాయుడు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ముగ్గురికి గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్‌అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఎస్ఐ వెంకటరెడ్డి సమాచారం మేరకు.. కొలిమిగుండ్ల మండలం బెలూం గ్రామానికి చెందిన బాలరాజు భార్యాపిల్లలతో కలిసి చాగలమర్రి మండలం వనిపెంటలో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరాడు. పట్టణ శివారులోని పేరా బిల్డింగ్ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలరాజుతోపాటు కుమారులు విజయతేజ, అనురాగ్ గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది క్షతగాత్రులను కోవెలకుంట్ల ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యువకుడికి గాయాలు

అవుకు: పట్టణ సమీపంలోని తాడిపత్రి రహదారిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అవుకు పట్టణానికి చెందిన ఫోర్ వీలర్ వాహనం రామాపురం గ్రామం నుంచి వస్తుంది. అదేవిధంగా అవుకు పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు రాజు మోటార్ సైకిల్‌పై తాడిపత్రి వైపు వెళ్తున్నాడు. రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనండంతో రాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. క్షతగాత్రున్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రునికి రెండు చేతులు, ఒక కాలు విరగడంతో పాటు తలకు కూడా గాయాలు అయినట్లు ఈఎంటీ జనార్ధన్ తెలిపారు.

ముస్లిం సోదరులు ఐకమత్యంగా ఉండాలి



ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి స్వీట్ తినిపిస్తున్న ముస్లిం పెద్దలు

బనగానపల్లెరూరల్: ముస్లిం సోదరులు ఐకమత్యంగా ఉండాలని, ప్రభుత్వం సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసదీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పట్టణంలోని అన్ని మసీదుల్లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక జంగ్లీమా మసీద్, జుమ్మామసిద్‌లో ఎమ్మెల్యే కాటసాని పాల్గొని ముస్లింలకు ఇఫ్తార్ విందు స్వయంగా వడ్డించారు. ముస్లిం పెద్దలు సైతం ఎమ్మెల్యే స్వీటు తినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్ష పాటించడం జరుగుతుందన్నారు. ఉపవాసదీక్షలో ఉన్న సోదరులకు ప్రతియేటా ఇఫ్తార్ విందు ఇవ్వడం జరుగుతుందని, ఈ ఏడాది కూడ అనవాయితీగా ఏర్పాటు చేశామన్నారు. అల్లా దయ, ఆశీస్సులతో గతేడాది సకాలంలో వర్షాలు కురిసి రైతులు, వ్యాపారులు అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, ఈ ఏడాది కూడ అలాగే అల్లా కరుణించాలని, అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని దేవున్ని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని జంగ్లీమా మసిద్ కమిటీ పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్ జాహెద్, అత్తార్ అఖిల్, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, మహబూబ్‌వలి, సురేష్, మసీద్ కమిటీ పెద్దలు ఇస్మాయిల్ రఫీ అహమ్మద్, షబ్బీర్, వహిద్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణలో జాగ్రత్తలు పాటించాలి



మంటలార్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్: అగ్నిప్రమాదాల నివారణంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని బనగానపల్లె అగ్నిమాపకశాఖ అధికారి నరసింహులు సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని జీఎంటాకీస్, శ్రీపొట్టి శ్రీరాములు సర్కిల్‌లోని హోటల్ వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్స్‌లలో ప్రమాదాల నివారణకు ముందుస్తుగా తగిన భద్రత ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనుకొని విధంగా ప్రమాదం సంబవిస్తే ఫైర్ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్యాస్ సిలిండర్ లీకేజీ అయితే మంటలార్పే తీరును ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు.

'గడప గడప' సమస్య పరిష్కారం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం బీసీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. కొద్ది రోజుల క్రితం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో బీసీ కాలనీ వాసులు తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి విన్నవించగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవలనే బోరు ఏర్పాటు చేయడంతో సమృద్ధిగా నీళ్లు పడ్డాయి. ఈ మేరకు ఆదివారం సర్పంచ్, ఉపసర్పంచ్ మారం నీలమ్మ, బాచం మహేశ్వరరెడ్డి బోరుకు మోటార్ ఏర్పాటు చేసి ప్రారంభించారు. త్వరలోనే పైపులైన్‌కు కనెక్షన్ ఏర్పాటు చేసి నీటి సరఫరా అందిస్తామని వారు తెలిపారు. గడపగడప కార్యక్రమంలో ఇచ్చిన హామీ పరిష్కారం కావడంతో బీసీ కాలనీ వాసులు ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



బోరుకు మోటార్ అమర్చిన దృశ్యం

బీజేపీని గద్దె దింపుదాం

ప్యాపిలి: కేంద్రంలో బీజేపీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ అన్నారు. ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రచారభేరి యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాక మునుపు 450 రూపాయలుగా ఉన్న గ్యాస్ సిలిండర్ ఇప్పుడు ఏకంగా రూ. 1200 చేరుకుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, సూర్యప్రతాప్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమరజీవి ప్రాణత్యాగాన్ని మరువకూడదు



పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగాన్ని ఎప్పటికీ మరువకూడదని, ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. దాదాపు 22 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పొట్టిశ్రీరాములు విగ్రహం శిథిలం కావడంతో దాతల సహకారంతో నూతన విగ్రహాన్ని తయారు చేయించారు. నూకల వెంకటసుబ్బయ్య, నూకల విజయకుమార్, నల్లగట్ల వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కేతేపల్లి శివచంద్రయ్య సహకారంతో ఏర్పాటు చేసిన అమరజీవి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఆవిష్కరించారు. అంతకు ముందు ఆర్యవైశ్యభవనం నుంచి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో పాటు ఆర్యవైశ్యులు ర్యాలీగా పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. పొట్టిశ్రీరాములు ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కోసం 57 రోజుల పాటు అమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. అలాంటి అమరజీవి విగ్రహ ఆవిష్కరణ తన చేతుల మీదుగా జరుపుకోవడం తన భాగ్యమన్నారు. ఆర్యవైశ్యులు అన్నిరంగాల్లో రాణించేందుకు తనవంతు సహకారం ఉంటుందన్నారు. ఆర్యవైశ్యుల శ్మశానవాటికలో అన్నిమౌలికవసతులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అభివృద్ధి కోసం మరో రూ.10లక్షల నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆర్యవైశ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కాటసాని సోదరులు కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండంశేషిరెడ్డి, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరరెడ్డి, ముస్లిం షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్‌ఖైర్, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, అబ్దుల్‌ఫైజ్, మహబుబ్‌వలి, ఆర్యవైశ్య సంఘం నాయకులు నూకల వెంకట సుబ్బయ్య, నూకలవిజయకుమార్, డి వెంకటసుబ్బయ్య, భరతుడు, శ్రీరామ వెంకట సుబ్రమణ్యం, గుండా శ్రీనివాసులు, బచ్చుమధుసూదన్, సురేష్, సురేంద్రబాబు, శివరాజ్, బండారుప్రకాష్, ఫణీంద్ర, నాగేంద్ర, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గనను విమర్శించే అర్హత మీకు లేదు !

- ప్రజా క్షేత్రంలో గెలవని లోకేష్, వార్డు మెంబర్‌గా గెలవని సుబ్బారెడ్డికి గుణపాఠం తప్పదు
- బుగ్గన వంశం గురించి తెలుసుకుని మాట్లాడండి
- మీలా ఆస్తులు కూడబెట్టుకునేందుకు రాజకీయాల్లోకి రాలేదు
- పద్ధతి మార్చుకోకుంటే మూల్యం తప్పదు
- హెచ్చరించిన వైఎస్సార్‌సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: ప్రజా క్షేత్రంలో గెలవని లోకేష్ బాబు, వార్డు మెంబర్‌గా కూడా గెలవని, నేర చరిత్ర కలిగిన డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డికి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, గూని నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు మూర్తుజావలీ, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. యువగళం పాదయాత్రలో లోకేష్, ధర్మవరం సుబ్బారెడ్డి బేతంచెర్ల శేషారెడ్డి ఉన్నత పాఠశాల, పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ గురించి మంత్రి బుగ్గనపై విమర్శలు చేయడం సబబు కాదన్నారు. ఎన్నికల్లోకి రాకముందే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సొంత నిధులతో బేతంచెర్ల, డోన్ పట్టణాల్లో బాలికలకు పాఠశాలలను నిర్మించడమే కాకుండా ప్యాపిలి మండలంలో వైద్య శాలను నిర్మించారని గుర్తు చేశారు. మూతపడిన పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని బుగ్గన చొరవతో పునఃప్రారంభిస్తే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదనడం ఏ మాత్రం భావ్యం కాదన్నారు. గోర్లగుట్ట గ్రామంలో దేవాలయ భూములను ఆక్రమించుకున్నారని నిందలు వేయడం కాదు, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. శేషారెడ్డి కుటుంబం బడి, వైద్య శాల, పశువైద్యశాల, కల్యాణశాల, దేవాలయాల నిర్మాణాలకు సొంత స్థలాలు త్యాగం చేశారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాల, పోలీస్ స్టేషన్‌తో పాటు పోలీస్ క్వార్టర్స్‌కు స్థలాలు ఇచ్చిన విషయం తెలియదా అని నిలదీశారు. ఖాళీగా ఉండే పోలీస్ క్వార్టర్స్ గ్రౌండులో ఎవ్వరైనా ప్లాటు వేశారా అని ప్రశ్నించారు.

నాటు సారా, అక్రమ మైనింగ్ చేసిన చరిత్ర నీది...

నాటుసారా మొదలుకొని, అక్రమ మైనింగ్ చేసిన చరిత్ర ధర్మవరం సుబ్బారెడ్డిది అని వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. అక్రమ మైనింగ్ కేసుల్లో రూ. 100 కోట్ల పెనాల్టీ విధిస్తే, పెనాల్టీ నుంచి బయట పడటానికి టీడీపీ కండువా కప్పుకుంది ఎవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. స్వార్థ ప్రయోజనాలకు పాల్పడే నీవు స్వాతంత్ర్యం రాకమునుపు నుంచే ప్రజలకు సేవలు అందిస్తున్న బుగ్గన కుటుంబంపై విమర్శలు చేస్తే రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. డోన్ నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధిపై చర్చకు ఎక్కడైనా వస్తామని, అందుకు మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్ నాయకులు బండి కాటి వెంకటేశ్వర్ రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.